# నేను నేనే

నేను పాలరాతి బొమ్మలా ఉంటానట.

'సజీవ శిల్ప సుందరి' అని శ్రీశ్రీ నన్ను చూసే అనుంటాడట.

వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లను నేనేనట...

ఈ పొగడ్తలకు నేను పొంగిపోయానా?

నచ్చిన వాళ్ళున్నప్పుడు ఆనందించాను. నచ్చని వాళ్ళున్నప్పుడు కోపగించాను.

"దీనికి ముక్కు మీద వుంటుంది కోపం. ఆడదానికి అంత కోపం తగదు. దీనికెప్పుడొస్తుందో అణకువ" అనేది అమ్మ.

"మన పెళ్ళయిన కొత్తలో నీకు మాత్రం ముక్కుమీద కోపం వుండేది కాదా. ఇద్దరు పిల్లలు పుట్టేటప్పటికి నీ కోపతాపాలు పోలేదూ" అనేవాడు నాన్న అమ్మను.

"నీ ముక్కు మీది కోపం నీ ముఖానికే అందం". అనేవాడు శేఖర్ పెళ్ళికాక ముందు.

"నా కోపతాపాల్ని సహిస్తున్నాడంటే నన్నెంతగా ప్రేమిస్తున్నాడో" అనుకుంది తను.

అనుకున్నామని జరగవు అన్నీ, అనుకో లేదని ఆగవు కొన్ని....

అంటే దేనికీ మన ప్రమేయం లేదనా?

శేఖర్ తన చుట్టూ తిరక్కపోతే అతన్ని పట్టించుకునేదాన్నా? తను పట్టించుకోకపోతే, మా పెళ్ళయ్యేదా? పెద్దగా కట్నాల ప్రసక్తి లేకుండానే, శేఖర్ తనను వివాహం చేసుకున్నాడు. నాన్నకూడా తమకున్నదాంట్లో బాగానే ముట్ట జెప్పాడు.

పెళ్ళి చేసుకునేముందు శేఖర్ ఏమనుకుని వుంటాడు? "నేను ప్రేమించి పెళ్ళి చేసుకుంటున్నాను. కాబట్టి సరళ నేను చెప్పిన మాట తు.చ. తప్పకుండా వింటుంది. నా మాటకెదురు చెప్పదు" అని ఆశించే వుంటాడు.

శేఖర్‌ను తను ముందు ఇష్టపడిందా? లేదు. అతను తనంటే ప్రేమ అంటూ తిరిగాడు కాబట్టి తనిష్టపడింది. తనంటే పడిచస్తున్నాడు కాబట్టి, రేపు పెళ్ళయ్యాక తను చెప్పినట్టు వింటాడనుకుంది. తనను బాగా చూసుకుంటాడనుకుంది.

బాగా చూసుకోవడమంటే? జీతం రాగానే తన చేతికివ్వడం, మంచి చీరలు కొనిపెట్టడం, సినిమాలకూ, షికార్లకూ తీసుకెళ్ళడం......అంతేనా? అప్పుడు అంతేననుకుంది.

అంతా భ్రాంతియేనా? జీవితానా వెలుగింతేనా? ఏది భ్రాంతి? ఏది వెలుగు? దూరపు కొండలు

భ్రాంతి. ఎండమావులు భ్రాంతి.ఆలోచన వెలుగు.జిజ్ఞాస వెలుగు. చదువు వెలుగు. అనుభవం వెలుగు.

వెలుగు నీడల్లో.....తను నీడ కాలేక పోయింది.

మగవాడు వెలుగూ, ఆడది నీడానట. అమ్మ అనేది.

అమ్మ ఆ మాట నమ్మే అనేదా? అనుమానం లేదు. నాన్న మాటకు ఎదురుచెప్పకుండా, తన ఇష్టాయిష్టాలు బయట పెట్టకుండా వుండేదంటే, తను నీడ అని అమ్మ నమ్మిందనే అనుకోవాలి.

చూడు చూడు నీడలు. నీడలు పొగ మేడలు... ఆడది నీడగా వుంటే దాని బతుకు పొగ మేడే...పై కెళ్దామని తను మెట్లెక్కుతోంది. ఒక్కొక్క మెట్టూ ఎక్కాలని....పై కెళ్ళాలని...... పొగ....... దట్టంగా....... పొగ. గాలి కెరటాల్లా శ్వేత నాగులు. శేఖర్ తనమీంచి లేచేవాడు. కళ్ళు తెరిచి చూస్తే ... అక్కడ మెట్లే లేవు. అదొట్టి పొగ మేడ.

అసంతృప్తి .. అగ్ని జ్వాల .. చల్లారాలి ... అంత వరకూ హిమజ్వాల ... నేను హిమజ్వాలనా .. అగ్ని జ్వాలనా? ప్రతి జీవీ ఓ జ్వాల. శరీరంలో జ్వాల వున్నంత వరకే ప్రాప్తం. పద పదవే గీతమా, పదవే నా ప్రాణమా...

పాటకు పల్లవి ప్రాణం. పల్లవి ఇప్పుడెక్కడుందో. తనంటే ప్రాణం పెట్టేది. పల్లవి, అనుపల్లవి అని తమను కాలేజీ రోజుల్లో ఓ కవి కుమారుడు వర్ణించాడు.

పల్లవి నేలబారు మనుషుల్ని పట్టించుకునేది కాదు. సైకిళ్ళ పై వచ్చే స్టూడెంట్లంటే చిన్న చూపు. స్కూటర్ల పై వచ్చే వాళ్ళను చూసేది. తమ కాలేజీ స్టూండెంట్లెవరూ కారుల్లో వచ్చేవారు కాదు. అయినా రోడ్డుపై ఎవరన్నా కారులో వెళ్తుంటే ఆసక్తిగా చూసేది.

"కారూ, లేదా కనీసం స్కూటరు, పెద్ద ఉద్యోగం వున్నవాణ్ణే పెళ్ళి చేసుకుంటానే" అనేది.

అప్పట్లో స్కూటర్లు కూడా తక్కువే.

ఆఖరికి స్కూటర్ మీద వచ్చే ఓ ఆస్తిపరుడితో స్నేహం చేసింది. బాహాటంగా తిరిగింది.

"మరీ అంత క్లోజ్‌గా వుండకే. అతను కానీ హేండిచ్చాడంటే, తర్వాత ఆకులు పట్టుకుని ప్రయోజనం వుండదు". అని తనోసారి హెచ్చరించింది.

"అలా జరగనివ్వనులే. నేనలా రాసుకుపూసుకు తిరక్కపోతే సురేష్ నా వెంట అలా పడడు. నేనంటే పడి చచ్చేలా చేస్తున్నానులే. ఎంత దూరంలో వుంచాలో అంత దూరంలో వుంచుతున్నానులే" అంది పల్లవి.

మొత్తానికి అతన్నే చేసుకుంది. మద్రాసులో అతనికి ఉద్యోగం వచ్చింది. పల్లవి మద్రాసు నుంచి అప్పుడప్పుడూ ఉత్తరాలు రాసేది. టి.వి., వి.సి.ఆర్., ఫ్రిజ్, ఫర్నిచర్ వంటివన్నీ సమకూర్చుకున్నాననీ రాసింది. ఆమె ఉత్తరాల్లో ఆస్తిపాస్తుల ప్రస్తావనే వుండేది. తను సుఖంగా వుండి వుంటుందా? ఆస్తిపాస్తులతో సుఖ సంతోషాలుంటాయా? భౌతిక సుఖాలు తప్పక వుంటాయి. సుఖాలవేనా?

అవే అయితే తనూ సుఖపడి వుండాలి. కార్లలో తిరక్కపోయినా, మేడల్లో వుండకపోయినా, తనూ



ఆర్థికంగా బాధపడింది లేదు. నీడలా వుండుంటే తనూ సుఖపడేదా?

నీ సుఖమే నే కోరుతున్నా, నిను వీడి అందుకే వెళుతున్నా ... అలా వుండగలగడం సాధ్యమేనా ... ఒకరంటే ఒకరికి ఎంత ప్రేమ, ఎంత స్నేహం వుండాలి, అలాంటి భావన రావాలంటే ...

భావన ... భావం ... భావప్రాప్తి ... ప్రాప్తి భావం ... ప్రాప్తి ... ఎవరికెంత ప్రాప్తం వుంటే అంతే పొందుతామని అమ్మ అనేది. అమ్మ మాటలు ప్రకారం తనకే ప్రాప్తం లేదనుకోవాలి. అలా సరిపెట్టుకోవాలి. తనలా సరిపెట్టుకోలేక పోయింది.

అవును, ఉప్పూ కారం తినే మనిషికి కోరికలుంటాయని అంతా ఒప్పుకుంటారు. స్త్రీ దగ్గరకు వచ్చేటప్పటికి 'నిగ్రహం' అనే మాటను 'విగ్రహం'లా చేసి నిలబెడతారు.

ప్రతి జీవీ ఆకలి తీర్చుకోక తప్పదు, జీవించాలంటే. పులికి ఏ మాంసమో ఓ మాంసం దొరికితే చాలు. మేకకు ఏ ఆకో ఓ ఆకు దొరికేతే చాలు. కానీ, మనిషికలా కాదే. భోజనంలో రుచులు కావాలి. ఉప్పూ కారం సరిపోవాలి. ఇవేళ తిన్న కూర రేపు తినబుద్ధి కాదు. తనకిష్టమైన రుచులతో భోంచేస్తే కానీ తృప్తి వుండదు. మరి మరో ఆకలి?

సెక్స్ .. సెక్సులో సెన్స్ వుండక్కర్లేదా? సెక్స్‌లో కూడా రుచులు కోరుకునే వాళ్ళు కొందరున్నారు. తనలా కోరుకుందా? లేదు, లేదు. తన భర్తతోనే సుఖించాలనుకుంది. తనకు నేనూ, నాకు తనూ అనుకుంది. సెక్స్ కూడా ఒక ఆర్టే అనుకుంది. అరవై నాలుగు కళల్లోనూ సెక్సు కూడా ఒక కళే అని మనవాళ్ళు అన్నారా? దొంగతనాన్నే ఒక కళగా గుర్తించిన వాళ్ళు సెక్స్‌ను ఒక కళగా గుర్తించరా? గుర్తించే వుంటారు. వాళ్ళు గుర్తించినా, గుర్తించకపోయినా, నా దృష్టిలో అదీ ఓ కళే!

శేఖర్‌కు ఆ దృష్టి లేదు. తను, తన సుఖం. రోజూ రాత్రి భోజనం కాగానే మంచమెక్కుతాడు. కాస్త ఉప్పు తక్కువయినా, కారం తక్కువయినా తృప్తిగా భోంచెయ్యడు. కానీ, పడక దగ్గర కొచ్చేటప్పటికి, పడక సుఖం, సుఖం పడక. అన్నం తిన్నట్టు కూడా కాదు. ఒకటే దృష్టి. తను, తన ఉద్రేకం. భార్య స్పందనతో పని లేదు. ఎలా స్పందిస్తుందో తెలుసుకోవాలనే జ్ఞానం లేదు. మృగ శృంగారమా అది, లేక మగ శృంగారమా? ...

ఉవ్వెత్తున లేచిన కెరటం పడిపోవటం ప్రకృతి సహజం కదా. అది తనకెందుకు లభించలేదు?

మంటలు లేస్తాయి. స్వర్ణ సర్పాలు పంకర్లు తిరుగుతూ పైపైకి లేస్తాయి. నీలి నాగులు నాలుకలు ముందుకు చాపి, మింటిని తాకాలని చూస్తాయి. వర్షం కురిస్తేనో, నీళ్ళు పోస్తేనో స్వర్ణ సర్పాలు నెమ్మది నెమ్మదిగానో, వేగం వేగంగానో బంగారం ముద్దలయి తళ తళలాడతాయి. కళ కళలాడతాయి.

ఒకేసారి మంటలే లేవవు. ఒకేసారి మంటలే మంటలు. మంటలు .... మంటలు ... మంటలు . ఆరని మంటలు. తీరని మంటలు. ఆరని తీరని మంటలు.

సహించేను సహించేను. జ్వలించేను జ్వలించేను.

తెలియని తనమేమో అనుకున్నాను. ఓ మగడా నీ పాలరాతి బొమ్మ, నీ సజీవ శిల్పసుందరి, నీ

వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్ల శరీరానికి కూడా స్పందన వుంటుంది. ఎక్కడే స్పందనో తెలుసుకో. నేను చెబుతాను, అలా మసులుకో. నువ్వు స్పందించి నన్ను స్పందింపజేస్తావో, నన్ను స్పందింపజేసి నువ్వు స్పందిస్తావో ... నీతోపాటు నాకూ స్పందన కావాలి. ఎందుకంటే నేను ఒట్టి బొమ్మను కాను, మర బొమ్మనూ కాను ... అని చెబుదామనుకున్నాను

మనువు దగ్గర్నించి మా మామ్మదాకా గుర్తుకొచ్చారు. వాళ్ళ ముఖాల్లో కోపం, వాళ్ళ ముఖాల్లో అసహ్యం. వాళ్ళ ముఖాల్లో ద్వేషం.

"ఆడదంటే హిమగిరి సుందరి. ఆడదంటే సహన శీలి. ఆడదంటే మైనపు బొమ్మ. ఆడదంటే మూగరాలు. ఆడదంటే సీత, సుమతి. భర్త సుఖాన్ని కోరుకునేది. ఆడదానికి భర్త సుఖమే తన సుఖం. భర్త తోడిదే లోకం" అని వాళ్ళంటున్నట్టు తనకనిపించేది.

"నేనే పాపం చెయ్యడం లేదే. పరాయి పురుషుడ్ని కోరుకోలేదే. నా భర్తతోనే నేను సుఖిద్దామనుకుంటున్నాను" అన్నాను నెమ్మదిగా.

మనువు నవ్వాడు. మామ్మ నవ్వింది.

"ఎంత పిచ్చిదానివి. ఎంత పిచ్చికూనవి. నీ భర్త నీతో సుఖపడుతున్నాడంటే నువ్వూ సుఖపడుతున్నట్లే లెక్క. నీకు వేరే సుఖమెందుకే వెర్రికుట్టీ" అని వాళ్ళు ఏవో, ఏవేవో నీతి శతకాలు పల్లించినట్టనిపించింది.

అలా తర్జన భర్జనలు. మీన మేషాలు సిగ్గెగ్గులు లేదా సిగ్గుల మొగ్గలు. మొగ్గల సిగ్గులు. వెనక్కి తగ్గులు. కన్నీళ్ళ మగ్గులు. మగ్గుల కన్నీళ్ళు. మగ్గుల మగ్గుల కన్నీళ్ళు మగునల నిగ్గులట. మగ్గల మగ్గల పెగ్గులు మగవాళ్ళ రగ్గులట. వెచ్చని రగ్గులు మగవాళ్ళకు రమణీలలామలేనట ... మరి మగాళ్ళ టైలు ఆడాళ్ళ ఉరితాళ్ళా ....?!

టైలు .. టై .. టైసన్ .. బాక్సింగ్ వీరుడు. బలంతో ధనం. ధనంతో మదం. టైసన్ ఆ అమ్మాయిని బలాత్కరించడా? ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌ను ఆ రంగం నుంచి పంపెయ్యడానికి ఆ అమ్మాయి చేత అలా చెప్పించారా .. అనుమానాలు. వినూనాలు. కీర్తి బలం, ధన బలం, శారీరక బలం వున్నాయని టైసన్ ఆమెను బలాత్కరించే వుంటాడు. కోర్టు శిక్ష వేసిందిగా.

మగాడు శారీరక బలంతోనే కదా స్త్రీని అణగ దొక్కడం ప్రారంభించేడు. మొన్నటి దాకా బలంగల, బలగంగల వాడిదే రాజ్యం. ఇప్పుడూ ధన బలంగలవాడిదే భోజ్యం. అప్పుడూ ఇప్పుడూ స్త్రీ దోపిడీ వస్తువే! నువ్వు సిద్ధంగా వున్నంత వరకూ దోపిడి జరుగుతూనే వుంటుంది. నువ్వు ఎదుటి వాడికి ఆ అవకాశం ఇవ్వకపోతే .. ఎదురు తిరిగితే ...

ఎదురు తిరిగాననే కదా శేఖర్ గిజ గిజ గింజుకు పోయాడు. తను ఎదురు తిరగడానికి ముందు ఎంత కాలం ఎదురు చూసిందో ... తనూ సుఖిద్దామనుకుని సెక్స్‌లో కొంచెం చొరవ చూపబోతే .. 'ఇలాంటివన్నీ నీకెవడు నేర్పాడే' అని నన్ను హర్ట్ చేశాడు.

ఆడది మన్ను తిన్న పాములా వుండాలట. నలుగురితో నవ్వుతూ మాట్లాడకూడదట. భర్తతోనయినా సరే వాదించకూడదట. అంతెందుకు, నువ్వు నువ్వులా వుండ కూడదుట. నాకు నేను నేనులా వుండడమే ఇష్టం. అతనికది అయిష్టం.

శేఖర్‌తో విడిపోక తప్పలేదు.

"నీకు ఒళ్ళు కొవ్వెక్కిందే, నిక్షేపంలాంటి సంసారం వదులకున్నావు. ఆడదానికంత పొగరుండ కూడదు" అని అమ్మ తిట్టింది. మామ్మ ఏడ్చింది.

బరి తెగించిందని కొందరన్నారు. భరించాను. ఉద్యోగం వచ్చేదాక సహించాను. ఉద్యోగంలో చేరాక ఈ లోకాన్ని 'డోంట్ కేర్' అన్నాను.

ఆఫీసులోనూ సమస్యలు ఎదురయ్యాయి. ఎదుర్కొన్నాను.

భర్తకు విడాకులిచ్చిన ఆడదంటే మగాళ్ళకెంత చులకన. ఓ కొలీగ్ లాడ్జికి ఆహ్వానించాడు. చెంప చెళ్ళుమనిపించాను. దాంతో మిగతా వాళ్ళకు భయం పట్టుకుంది. ఫైర్ బ్రాండ్ అనీ, డేంజరస్ ఫెలో అనీ నా వెనకాల చెవులు కొరుక్కున్నారని తెలిసింది.

ఆ సంఘటన జరిగాక, మరో కొలీగ్ రంగారావు "మంచి పని చేశారు" అన్నాడు. ఆ తర్వాత మేం స్నేహితులమయ్యాం. సాహిత్యం, సంగీతం, సినిమా... ఇలా చాలా విషయాల్లో మా అభిప్రాయాలు కలిశాయి.

ఒకోసారి వాదించుకున్నాం. ఇద్దరి అభిప్రాయాలు కలవనప్పుడు, ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకున్నాం. రంగారావుతో పరిచయమై రెండేళ్ళు దాటింది.

ఈ మధ్యనే మేరేజ్ ప్రపోజ్ చేశాడు. లేదా కలిసుందామన్నాడు. ఆలోచించి చెబుతానన్నాను. నిజానికి పెద్దగా ఆలోచించడానికేమీ లేదు. అయితే, సెక్స్ పట్ల అతని అభిప్రాయాలేమిటో తెలుసుకోవలసి వుంది.

సెక్స్ జీవితంలో ఓ భాగమే కానీ, అదే జీవితం కాదని నాకు బాగా తెలుసు. శేఖర్ అన్ని విషయాల్లోనూ నన్ను నన్నుగా చూసివుంటే, నేనతనికి దూరమయ్యేదాన్ని కాను. ఏ అనారోగ్యం వల్లో ఏ యాక్సిడెంటు వల్లో సెక్స్‌కు అతను పనికి రాకపోతే ఆ సుఖం గురించి మరచిపోయేదాన్ని. కానీ, అతని అజ్ఞానం, మూర్ఖత్వం, అహం భరిస్తూ వుండ లేకపోయాను.

రంగారావుతో రేపు మాట్లాడాక కానీ, ఒక నిర్ణయం తీసుకోను.

"మన ఊహ తక్కువ తనం మనల్ని తప్పుడు మార్గం తొక్కిస్తుంది. పరిస్థితుల్ని సరిగా అంచనా కట్టుకోనప్పుడు మనం తప్పుడు పరిష్కారాలకి దిగవలసి వస్తుంది" అని రా.వి.శాస్త్రి గారు 'గేవులొస్తున్నాయి జాగ్రత్త'లో అనుకుంటాను అన్నారు.

అంచేత, గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని, తొందరపడకుండా, నిర్ణయం తీసుకుంటాను. సరైన నిర్ణయం తీసుకోగలననే నమ్మకం నాకుంది.

*(రచన మాసపత్రిక, ఆగష్టు 1994)*